ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 27 నవంబరు 2024
www.prajaaswaramdaily.com
2 pm

# సెక్యూరిటీ మోసాల అభియోగాలే

**వెల్లడించిన అదానీగ్రూప్**
**ఎఫ్సీపీఏ ఉల్లంఘన ఆరోపణలు అవాస్తవం**
**స్టాక్ ఎక్ఛేంజీకి ఫైలింగ్లో స్పష్టీకరణ**

ముంబై : లంచం కేసుకు సంబంధించి న్యూయార్క్ కోర్టులో అమెరికా అధికార యంత్రాంగం చేసిన నేరారోపణల్లో బిలియనీర్ గౌతంఅదానీ, ఆయన మేనల్లుడు సాగర్ పై...అమెరికా ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ ను ఉల్లంఘించారన్న అభియోగాలు మోపలేదని అదానీగ్రూప్ తెలిపింది. జరిమానా లేదా ఫెనాల్టీతో విధించే సెక్యూరిటీ మోసాలకు సంబంధించిన అభియోగాలు నమోదు చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ...స్టాక్ ఎక్ఛేంజీకి సమర్పించిన ఫైలింగ్ లో పేర్కొంది. వారు ఎఫ్సీపీఏ ఉల్లంఘనలకు పాల్పడ్డారన్న ఆరోపణల్లో



ఏమాత్రం వాస్తవంలేదని వెల్లడించింది. జరిమానా లేదా పెనాల్టీ విధించే నేరాలకు సంబంధించిన అభియోగాలు మాత్రమే మోపినట్లు... అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ తెలిపింది.

# పోలీసుల పహారా



**పలువురి ముందస్తు అరెస్టులు**
**మరోసారి వికటించిన మధ్యాహ్న భోజనం ..**
**నారాయణపేట మాగనూరు ప్రభుత్వ పాఠశాల వద్ద భారీ బందోబస్తు**

నారాయణపేట మాగనూరు ప్రభుత్వ పాఠశాల వద్ద పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.....పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేస్తున్నారు. పాఠశాల పరిసర ప్రాంతం నుంచి చుట్టూ 100 మీటర్ల మేర 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధించారు. ఎవరూ ప్రజలు రోడ్డు పైకి గాని స్కూల్ పరిసర ప్రాంతాల్లోకి గాని రావొద్దు అని పోలీసులు హెచ్చరించారు. గుంపులుగా గుమ్మికూడదని ఆదేశించారు జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మరోసారి వికటించడంతో విద్యార్థులు అస్వస్థతకు గురై... మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా.....మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో... పోలీసులు ముందస్తూ వారిని అరెస్టు చేసి స్టేషన్ కి తరలించారు. మరోవైపు పాఠశాలను సందర్శించేందుకు వెళ్లిన ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

## చిన్నకాళేశ్వరం పనులు
# 75 శాతం పూర్తి

**రెండేళ్లలో 45 ఎకరాలకు సాగునీరు**
**మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

హైదరాబాద్ : చిన్న కాళేశ్వరం – ముక్తేశ్వర ఎత్తిపోతల పథకానికి అవసరమైతే ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంథని ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టుకు 2007లో అప్పటి ప్రభుత్వం 571 కోట్ల 57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని అన్నారు. ఇప్పటి వరకు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తయినట్లు ఆయన చెప్పారు. మిగిలిన పనులు పూర్తి చేసి రెండేళ్లలో 45 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మంచినీటి అవసరాల కోసం మరో అర టీఎంసీ నీటిని వినియోగించనున్నట్లు మంత్రి వివరించారు. భూసేకరణ, ఇతరాల కోసం అవసరమైతే ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. ఈ మేరకు ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో నిర్ణయం తీసుకున్నట్లు శ్రీధర్ బాబు తెలిపారు.



## మాగనూర్ ఫుడ్ పాయిజన్ ఘటనపై
# హైకోర్టు సీరియస్

**పిల్లలు చనిపోతే గానీ స్పందించారా? అంటూ ఆగ్రహం**

హైదరాబాద్ : మాగనూర్ జడ్పీ స్కూల్ లో ఫుడ్ పాయిజన్ ఘటనపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించిన హైకోర్టు... వారంలో మూడుసార్లు భోజనం వికటిస్తే అధికారులేం చేస్తున్నారంది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించట్లేదని దాఖలైన పిల్ పై హైకోర్టు విచారణ జరిపింది. వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో తరచూ భోజనం వికటిస్తోందన్నారు. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ చాలా సీరియస్ అంశమన్న సీజే, పిల్లలు చనిపోతే కానీ స్పందించరా అని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమన్న హైకోర్టు, ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవడం లేదని వ్యాఖ్యానించింది. వారంలో కౌంటర్ వేస్తామన్న ప్రభుత్వ న్యాయవాదిపై హైకోర్టు తీవ్రఆగ్రహం చేసింది. వివరాలు సేకరణకు వారం వ్యవధి



ఎందుకన్న సీజే హైకోర్టు ఆదేశిస్తేనే అధికారులు పని చేస్తారా అని ప్రశ్నించింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే 5 నిమిషాల్లో హాజరవుతారన్న హైకోర్టు, అధికారులకు కూడా పిల్లలున్నారు కదా అని గుర్తు చేసింది. అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలంది. భోజన విరామం తర్వాత పూర్తి వివరాలు అందిస్తామని ఏఏజీ తెలిపారు.

# ఎందుకు మౌనం?

**అదానీ అవినీతి ఆరోపణలపై కేంద్రాన్ని ప్రశ్నించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు**
**కాంగ్రెస్ ప్రభుత్వం 100 కోట్ల విరాళం తిరస్కరణను స్వాగతిస్తున్నాం**

హైదరాబాద్ : పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నా కేంద్రం ఎందుకు మౌనం పాటిస్తుందో..ఆ వెనుకున్న మర్మమేంటో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అదానీ ఇచ్చిన 100 కోట్ల విరాళాన్ని తిరిగి ఇచ్చేస్తామనడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కులాలు, మతాల పేరిట బీజేప చేస్తున్న రాజకీయాలు శాశ్వతం కావని, మహారాష్ట్ర లాంటి ఫలితాలు మరోసారి పునరావృతం కావని స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ స్వయం కృతాపరాధం, స్వీయ అహంకారంతోనే ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో ఓడిపోయిందని తెలిపారు.



# గత ప్రభుత్వం పుణ్యక్షేత్రాలను గాలికొదిలేసింది

**ఆదరణకు నోచని యాదాద్రి, వేములవాడ**
**మంత్రి సురేఖ**

పెద్దపల్లి : రాష్ట్రంలోని అన్యాక్రాంతమైన దేవుని మాన్యాలను గుర్తించి వాటిలో చిరు పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా సబితం గ్రామంలో 50 లక్షల నిధులతో సీతారామాంజనేయ ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం యాదాద్రి, వేములవాడ వంటి పుణ్యక్షేత్రాలను సైతం గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని దేవుడి మాన్యాన్ని సంరక్షించి పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా కృషి చేస్తామని సురేఖ స్పష్టం చేశారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సైతం తెప్పించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.



# రాంగోపాల్ వర్మ ఎక్కడ?

**9 కేసులు నమోదు**
**బెయిల్ పిటిషన్లపై ఈరోజు విచారణ**

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో...విచారణకు హాజరుకాకుండా సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ అజ్ఞాతంలో తిరుగుతున్నారు. తాను ఎక్కడికి పారిపోలేదంటూ ఆర్జీవీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినప్పటికీ..ఆయన ఆచూకీ మాత్రం లేదు. ఎక్కడి నుంచి పోస్ట్ చేశారో పోలీసులు ఆరా తీసుకున్నారు. ఆయన ఆచూకీ కోసం రెండ్రోజులుగా పోలీసు బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళలో..ఆర్జీవీ కోసం పోలీసు బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో రాంగోపాల్ వర్మపై... 9 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం ఆర్జీవీ దాఖలు చేసిన పిటిషన్లపై..ఇవాళ మధ్యాహ్నం హైకోర్టు విచారించనుంది.



# సిద్దిపేటలో నకిలీ యాంటిబయోటిక్స్

**విలువ రూ. కోటిన్నర**
**రష్యాకు సైతం విక్రయం**



సిద్దిపేట : సిద్దిపేట జిల్లా ములుగు మండలం కరకపట్ల గ్రామంలో భారీ ఎత్తున నకిలీ యాంటీబయోటిక్స్ ను.... డ్రగ్ కంట్రోల్ బ్యూరో పట్టుకుని సీజ్ చేసింది. పట్టుబడిన నకిలీ యాంటీబయోటిక్స్ విలువ కోటిన్నర ఉంటుందని డ్రగ్ కంట్రోల్ బ్యూరో వెల్లడించింది. జోడాస్ ఎక్స్పో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఈ నకిలీ బయోటిక్స్ తయారు చేసి.......ప్రముఖ కంపెనీ పేరుతో సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రష్యాకు సైతం వీటిని విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నకిలీ ఔషధాలు తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్రగ్ కంట్రోల్ బ్యూరో అధికారులు హెచ్చరించారు.

# సీఎం హామీలను విస్మరించడం దుర్మార్గం

**ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ**
**మహాధర్నా శిబిరం సందర్శన.. సంఘీభావం**

హైదరాబాద్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పింఛను 4 వేలకు, దివ్యాంగుల పింఛను 6 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీలను విస్మరించడం దుర్మార్గమని మండిపడ్డారు. హైదరాబాద్ ధర్నాచౌక్ లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నిర్వహిస్తున్న మహాధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. గత డిసెంబర్ లోనే పెంచుతామన్న పెన్షన్ సంవత్సరమైనా పెంచకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే డిసెంబర్ నెలలో సంవత్సరం బకాయిలతో చేయూత, దివ్యాంగుల పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు నల్లజెండాలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

